# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## సి.నారాయణ రెడ్డి.

( *విజయచిత్ర 1969 మార్చి సంచిక*  నుంచి పునర్ముద్రణ)




"**సినిమా పాటలలో అశ్లీలం,** పచ్చి శృంగారం వున్నదని విమర్శిస్తే, దానికి బాధ్యులు కేవలం పాటల రచయితలే కారు. పాట రాసే రచయిత ఆ పాట పాడే పాత్రను  దృష్టిలో పెట్టుకుని, పాట రాస్తాడు. రాయాలి. పాత్రల స్థాయిని బట్టి పాటల రచన వేరుగా వుంటుంది. ప్రేయసీ ప్రియులు సంస్కారం గలవారయితే పాటల రచన ధోరణి పాట రచనలో 'సంస్కారం లేదు'  అనుకునే ముందే, ఆ పాత్ర ఎలాంటిదన్నది కూడా మనం ఆలోచించుకుంటే అది అర్ధంకాగలదు. నైట్‌క్లబ్బులో నృత్యం చేసే నర్తకి శాస్త్రీయమైన గీతాలు ఎలా పాడగలదు? అయితే, సినిమా పాటల రచనలలో 'దిగజారుడు' ఎక్కువగా కనిపిస్తున్నదని, రచయితలను విమర్శిస్తే మాత్రం నేను ఒప్పుకోలేను పాత్ర స్థాయిని బట్టి రచయిత పాటను రాయాలిగాబట్టి. అయితే, ఒక్కొక్కప్పుడు రచయిత మామూలుగా రాసేమాట – చిత్రీకరణకు వచ్చేసరికి, అసభ్యత స్ఫురించేలా కనిపించవచ్చును. దానికి రచయితను అంటే ఎలా?

ఉదాహరణకు 'ఏదో ఎదో అవుతున్నది' అన్నది మామూలు తెలుగు నుడికారం. 'నాకు ఏదోలా వుంది. అదోలా వుంది. గుండెలో ఏదో ఆవుతున్నది' అని మనం సామాన్యంగా వాడుతూ వుంటాం. అదే నుడికారాన్ని పాటలో పెట్టి మేము రాస్తే రాసేటప్పుడు ఏ విధమైన అసభ్యత, అశ్లీలం అందులో స్ఫురించవు. చిత్రీకరించడంలో 'అసభ్యత' గనక కనిపిస్తే ఆ తప్పును పాటల రచయితల మీదకు నెట్టడం భావ్యం కాదని నా ఉద్దేశం. 'నన్ను చూడు' అని పాటలో వున్నదనుకుందాం. దానికి ముఖాన్ని చూపించినంతవరకూ బాగానే వుంటుంది .'నన్ను చూడు' అని వక్షభాగాన్ని ప్రముఖంగా చూపిస్తే దానికి పాటల రచయిత ఎలా బాధ్యుడు కాగలడు?" అని ప్రశ్నించారు ప్రఖ్యాత పాటల రచయిత – డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి.

సింగిరెడ్డి నారాయణ రెడ్డి అయితే, 'సి ' ఏమిటి – 'యస్' ని వుండొద్దా అనే అనుమానం కలుగుతుంది. నారాయణ రెడ్డి స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో ఎందుకనో రిజిస్టర్‌లో 'సి' అని పడింది. 'సరేలే, తెలుగుకు కూడా పనికి వస్తుంద'ని ఆయన అప్పుడు సరిపెట్టుకున్నాడు. నాటినుంచీ 'సి' అక్షరమే అమల్లో వున్నది. కరీంనగర్ జిల్లాలోని హనుమాజిపేట ఆయన స్వగ్రామమం. రైతు కుటుంబం. 1931వ సంవత్సరంలో ఆషాఢ పౌర్ణమినాడు నారాయణరెడ్డి ఉదయించాడు. చంద్రుడు మనసుకు సంబంధించిన దైవం. అందువల్ల పౌర్ణమినాడు పుట్టినవాళ్ళు కవులు కావడానికి అవకాశం వున్నదని పెద్దలు చెబుతారు. (ఇవాళ ఆయన విరివిగా 'వెన్నెల పాటలు' రాయడానికి కూడా ఆ వెన్నెల రోజే కారణం కావచ్చును) తండ్రిగారు పుస్తకాలు రాసేంతవరకూ ఏ చదువూ చదువుకోలేదు. ఉత్తరాలు రాసేంతవరకూ మాత్రమే చదువుకున్నారు. వాళ్ళ వంశవృక్షంలో కూడా ఎక్కడా కవులు కనిపించరు. కాని నారాయణరెడ్డికి మాత్రం కవిత్వం మీద ఉత్సాహం కలిగింది. అసలు, అతనికి సంగీతం అంటే మొదట్నుంచీ అభిమానం. ఉషారుగా ఈలవేస్తూ ఏదో గాలిపాట పాడుతూ వచ్చేవాడు చిన్నతనంలో. సంగీతం మీద వున్న ఉత్సాహంతో అతను హరికథలు వినేవాడు. వేములవాడ నుంచి, హరికథకులు వాళ్ళ ఊరొచ్చి పాటలు పాడేవారు. ఆ పాటలు వినడంతో నారాయణ రెడ్డికి, సాహిత్యం మీద కూడా అభిలాష కలిగింది.

చిన్నతనంలో సాహిత్యం మీద అభిలాష ఎలా కలిగిందో చెప్పడం కష్టంగాని, అతను అవీ ఇవీ చదివి, కవిత్వం రాయాలనుకున్న ఉత్సాహంలో కూర్చుని, 14వ ఏట "ఒకనాడు ఒక నక్క ఒక అడవిలో చేరి, పొట్టకోసమెటో పొవుచుండె" అని ప్రారంభించాడు. అలా అలా, అదీ ఇది రాస్తూ తమ బడిలోని తెలుగు పండితులైన వెంకట రమణాచార్యులుగారికి చూపించాడు. ఆ అబ్బాయిలోని ఉత్సాహం ఆయన్ని ఆకర్షించింది. ఎలా రాయాలి? రాసిన మాటల్లో తప్పులేమిటి? ఎలా వుండాలి? అని వెంకట రమణాచార్యులుగారు నారాయణరెడ్డికి చెప్పేవారు. ఆ విధంగా అతను కవిత్వంలో కృషి చెయ్యడం ఆరంభించాడు. యతిప్రాసలు తెలియవు. వ్యాకరణం తెలియదు. అయినా సంస్కారంతోనూ సంపర్కంతోనూ అతనికి కవిత్వ ధోరణి అబ్బింది.

చిత్రం ఏమిటంటే, మెట్రిక్ అయ్యేదాకా కూడా అతని ఆధునిక కవిత్వంతో పరిచయం కలగలేదు. ఇంటర్‌మీడియెట్ చదువుకుని, నారాయణరెడ్డి హైదరాబాదు వచ్చాడు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో సభ్యుడిగా చేరి, ప్రాచీనాంధ్ర కావ్యాలూ, వర్తమాన రచయితల పుస్తకాలూ చదవడం సాగించాడు. అప్పుడే అతనికి ఆధునిక కవితాధోరణి తెలిసింది. ఆధునిక కవుల పేర్లూ తెలిశాయి.

హైస్కూలు చదువు పూర్తవుతున్న రోజుల్లోనే ఛందోరహస్యాలూ, వ్యాకరణ విశేషాలూ పెద్దల దగ్గర తెలుసుకుని కొన్ని నాటకాలు రాశాడు. సీతాపహరణం, జాతీయోద్యమం మొదలైనవి. ఆ నాటకాల్లో పద్యాలూ, పాటలూ, వచనమూ వుండేవి. విద్యార్థులందరు ఆ నాటకాలు ఆడారు. "మారాలి మారాలి మారలిర, కరడుగట్టిన నేటి కరకు సంఘపు రూపు మారాలిరా" అంటూ ఆ రోజుల్లోనే అతను అద్భుతమైన పాటలు రాశాడు.

ఇంటర్‌మీడియెట్ చదువుకుంటున్న రోజుల్లో ఓసారి కవి సమ్మేళనం జరిగింది. ఆ సమ్మేళనంలో అతను చాలామంది కవులను చూశాడు. కృష్ణశాస్త్రి, కరుణశ్రీ, జాషువా, శ్రీశ్రీ మొదలైన కవులందరూ తెలిశారు. విశేషం ఏమిటంటే నారాయణరెడ్డి కూడా విద్యార్థి కవిగా ఆ సమేళనంలో పాల్గొని ఒక గేయం చదివాడు. అది పూర్తికాగానే పెద్దలందరూ చప్పట్లు కొట్టడం అతనికి బాగా జ్ఞాపకం వున్న విషయం.

సంగీత జ్ఞానం కూడా నారాయణరెడ్డికి బాగా వుండడంవల్ల అతను ఏ పద్యమైనా, పాటైనా పాడుతూవుంటే, అతి మధురంగా హాయిగా వుంటుంది. ఆయన కంఠ మాధుర్యాన్ని విన్నవాళ్ళకు ఆ విషయం బాగా తెలుసు.

కవిగా అప్పటికే మంచి ఖ్యాతిలో వున్న దాశరథితో, నారాయణరెడ్డికి పరిచయం ఏర్పడింది. దాశరథి, అతన్ని అభినందించారు. నాటినుంచి, ఇద్దరికీ ఒక విధమైన భ్రాతృసంబంధం ఏర్పడింది. 'తెలంగాణా రచయితల సంఘం' అన్న పేరిట ఇద్దరూ కలిసి' ఒక సంస్థను స్థాపించారు. దాశరథి దానికి అధ్యక్షుడు. నారాయణరెడ్డి కార్యదర్శి. ఇద్దరూ , తెలంగాణా జిల్లాలలో తిరుగుతూ, సాహితీ స్రవంతులను ప్రవహింపజేసేవారు. సాంస్కృతిక సభల్లో, సాహిత్య సమావేశాల్లో, కవి సమ్మేళనాల్లో తరచు పాల్గొనేవారు. భారతి, ఆంధ్రపత్రిక తెలుగు స్వతంత్ర మొదలైన పత్రికలు నారాయణ రెడ్డి కవితను అచ్చు వేయడం సాగించాయి. అప్పుడే నారాయణ రెడ్డి పేరు, కవిత్వం పదిమందికీ బాగా తెలిశాయి.

యం.ఏ పూర్తి చేసే లోపల 'కవి'గా నారాయణరెడ్డికి మంచి ప్రఖ్యాతి ఏర్పడింది. ఆయన రాసిన పద్యాలూ, గీతాలూ, పుస్తకాలూ సాహితిపరులందరికీ బాగా పరిచయమైనాయి.

ఆ తర్వాత ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయ కళాశాలలో తెలుగు లెక్చరరుగా వుంటూ, పి.హెచ్.డి పూర్తి చేశారు. 'ఆధునిక ఆంధ్రకవిత్వము, సంప్రదాయములు, ప్రయోగములు' అనే పరిశోధనకు ఆయనకు 1963లో 'డాక్టరేట్'

లభించింది. తర్వాత 'రీడర్' అయినారు. ప్రస్తుతం ఆయన యం.ఏ తరగతుల విద్యార్థులకు బోధన చేస్తున్నారు. డాక్టరేట్ పట్టాకోసం కృషి చేస్తున్న విద్యార్థులకు 'గైడ్ 'గా వుంటున్నారు.

నారాయణ రెడ్డిగారి జీవితంలో స్వయంకృషే ఎక్కువగా కనిపిస్తుంది. రేడియోలో స్వీయ కవితాగానం చెయ్యడానికి, ఎక్కువగా పుస్తకాలు రాయడానికీ, కవిగా వక్తగా ప్రఖ్యాతి గాంచడానికీ ఆ కృషే కారణమైంది.

ఆయన సినిమారంగ ప్రవేశం అప్రయత్నంగానే జరిగింది. మొదట్లో కొంతమంది నిర్మాతలు ఆయనను సినిమాలకు పాటలు రాయవలసిందిగా అడుగుతూ వుండేవారు. అయితే అప్పట్లో ఆయన దానికి అంత ఉత్సాహం చూపలేదు. అయితే, ఎవరైనా అడిగితే చిత్రంలో వున్న అన్ని పాటలూ తన చేతనే రాయించవలసిందని కోరదామనుకున్నారు. అలా రాయడంతో, అన్ని రసాల పాటలు రాయవచ్చును అన్న దృష్టి వున్నది.

ఒకసారి, ఒక మిత్రునితో నారాయణరెడ్డిగారు సారథి స్టూడియోకు వెళ్ళారు .అప్పుడు 'కలసి వుంటే కలదు సుఖం ' షూటింగ్ జరుగుతున్నది. యన్.టి.రామారావుగారు మేకప్‌తో కనిపించారు. అంతకుముందు ఒకసారి రామారావుగారు, నారాయణరెడ్డిగారు మద్రాసులోని ఒక సెట్లో కలుసుకున్నారు. ఆ కాస్త పరిచయంతో, ఇద్దరూ కాస్సేపు మాట్లాడుకున్నారు.

"మీ విశ్వనాథనాయుడు పుస్తకం చదివాను. చాలా బావుంది" అని రామారావు అభినందించారు. నారాయణరెడ్డి సంతోషించారు.

"అయితే మీరెందుకు సినిమా పాటలురాయకూడదు? మీబోటివారి అవసరం వున్నది కదా" అన్నారు రామారావు.

"సమయం. స్థాయి వుంటే తప్పక రాస్తాను. నా కవిత్వంలోని వైవిధ్యాన్ని ప్రదర్శించగలిగే అవకాశం కూడా కలిగితే.." అన్నారు నారాయణరెడ్డి.

"అయితే మా రాబోయే చిత్రానికి మీరే అన్ని పాటలూ రాయాలి" అన్నారు వెంటనే రామారావు.

అలా జరిగింది నారాయణరెడ్డిగారి సినిమా రంగప్రవేశం. యన్.ఏ.టివారి 'గులేబకావళి ' చిత్రంలో మొదటిసారిగా ఆయన పాటలు  రాశారు. "మొదట్లో సినిమా పాట రాయడానికి కొంత శ్రమ కనిపించినా, ఆ చిత్ర సంగీత దర్శకులు రాజుగారు, నిర్మాత త్రివిక్రమరావుగారూ నాకు పద్ధతి చెప్పి, గైడ్ చేశారు" అని చెప్పారు నారాయణరెడ్డి. ఆ చిత్రంలో ఆయన అన్ని రసాల, రకాల పాటలూ రాయడంతో మంచి అనుభవం కలిగింది. జనరంజకంగా ఎలా రాయాలి? రసిక జనరంజకంగా ఎలా రాయాలి అన్న పద్ధతులు తెలిశాయి. కిటుకులు తెలిశాయి. కీలకాలు తెలిశాయి.

నారాయణరెడ్డి సినిమాల్లోకి రాకపూర్వం ఎన్నో కావ్యాలు రాశారు. వచ్చిన తర్వాత కూడా రాస్తున్నారు. ఆయన రాసిన కొన్ని రచనలు అజంతా సుందరి (నాటకం) కర్పూర వసంతరాయలు, విశ్వనాథనాయుడు, ఋతుచక్రము, సమదర్శనము, దివ్వెల మువ్వలు, వెన్నెలవాడ, అక్షరాల గవాక్షాలు, జాతిరత్నం. "మధ్య తరగతి మందహాసం" ప్రస్తుతం అచ్చులో వుంది.

నారాయణరెడ్డి రాసిన ఎన్ని సినిమా పాటలు హిట్ అయినాయి? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేము. హిట్స్ అయిన పాటల్లో ఆయన పాటలు చాలా వున్నాయి.

"పాట ఎలా ప్రచారం పొందుతుంది? అన్న విషయం కచ్చితంగా చెప్పలేం. అయితే, థీమ్ సాంగ్ (చిత్రంలో రెండుమూడుసార్లు వచ్చే ఒక పాట) ప్రచారంలోకి రావడానికి అవకాశం వుంది. ఒక్కోసారి మంచి పాట రాశాము అనుకున్నా, ఆ పాటకు ప్రజాదరణ లభించని సందర్భాలూ వున్నాయి. నా ఉద్దేశంలో, పాట ప్రజాదరణ పొందడానికి ముఖ్యంగా కావాలిసింది సన్నివేశం. కథతో అతుక్కుని వున్న పాటయితే, పాట రచన ఏ మాత్రం బాగున్నా ప్రచారంలోకి రాగలదు. నృత్యగీతాలు, యుగళగీతాలూ అయితే బాణీ బలం కావాలి. ఒక్కోసారి ఎలాంటి పాటయినా సరే ప్రచారంలోకి వస్తుంది. ఆ పాట, లౌడ్ స్పీకర్‌లలోనూ, రేడియోలోనూ తరచూ వినిపిస్తూ వుంటే చాలు. ఒక్కోసారి చిత్రంలో చూస్తున్నప్పుడు పాట రంజకంగా వినిపించవచ్చును. బయట విన్నప్పుడు కనిపించకపోవచ్చును. కొన్ని పాటలు ప్రేక్షకుల కోసం వుంటాయి. కొన్ని శ్రోతల కోసం వుంటాయి. శ్రోతలు సాధారణంగా గంభీరమైన పాటలు కోరుతూ వుంటారు. కరతాళ ధ్వనులూ, పదతాళ ధ్వనులూ వినిపించే పాటలు బయట ప్రపంచంలోకి రాకపోవచ్చును. ఇలా పాట ప్రచారంలోకి రావడం అన్నది పలు రకాలు" అన్నారు నారాయణరెడ్డి.

"చిత్రంలో పాట రాయడానికి మంచి సన్నివేశం లభించాలి. లభిస్తే మంచి పాట రాయవచ్చును. శృంగార యుగళ గీతాల్లో వైవిధ్యం కనిపించడానికి అవకాశం లేదు. అవుట్‌డోర్ పాటలయితే చెట్టూ, చేమా, ఇన్‌డోర్ పాటలయితే చందమామా అంతకు మించి వస్తువు లేదు. సన్నివేశ బలం గల పాటల్లో (ఉదాహరణకు 'ఆత్మబలం'లోని అనగనగరాజు) మంచి పాటలు కనిపిస్తాయి. సన్నివేశ బలం వున్నప్పుడే కవితా బలమూ కనిపిస్తుంది. ఇది సినిమాలకే కాదు. కావ్యాలకు  కూడా వర్తిస్తుంది. కుటుంబ గాథల్లో మంచి వస్తుబలం వుంటుంది" అన్నారాయన.

నారాయణరెడ్డిగారు రాసిన పాటల్లో నూటికి తొంభై తొమ్మిది పాటల్లో యతిప్రాసలు వుంటాయి. ఆ నియమం తప్పకుండా ఆయన పాట రాయరు. ఇంతవరకూ ఆయన ఐదువందల పాటలకు పైగా రాశారు. (గత సంవత్సరంలో 150 పాటలు పైగా రాశారు) ప్రస్తుతం ఆయన, అనేక చిత్రాల్లో  పాటలు రాస్తున్నారు. అందులో కొన్ని డి.వి. యస్, పి.ఏ.పి తారకరామా, డి.బి.యస్, శ్రీ గౌతం, భారతి, రవిచిత్ర, విజయభట్, యస్, వి.యస్, శ్రీరాజ్ ఆర్ట్ మొదలైన సంస్థలు నిర్మిస్తున్న చిత్రాలు.

నారాయణరెడ్డి పద్మా పిక్చర్స్ వారి "ఏకవీర" చిత్రానికి సంభాషణలు కూడా రాస్తున్నారు. ఈ చిత్రంతో ఆయన సంభాషణా రచయితగా కూడా స్థిరపడటం ఖాయమని పరిశ్రమ భావిస్తున్నది.

Post your comments